సాక్షి
సంగారెడ్డి
బుధవారం । 8 । నవంబర్ । 2023



హద్దు దాటితే.. కటకటాలే!
అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ పటిష్ట చర్యలు తీసుకుంటుంది. వివరాలు 10లో ▸



నిత్య పర్యవేక్షణకు.. నిఘా నేత్రం
ఎలక్షన్ అధికారుల వాహనాలకు పై భాగంలో సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. వివరాలు 10లో ▸



పరిశ్రమలకు స్వర్గధామం..
పరిశ్రమలకు స్వర్గధామంగా పటాన్‌చెరు నియోజకవర్గమని బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

112 కేసుల్లో రూ.4.08 కోట్లు సీజ్

సంగారెడ్డి టౌన్: ఇప్పటివరకు జిల్లాలో 112 కేసుల్లో రూ.4,08,15,470లు సీజ్ చేసినట్లు కలెక్టర్ శరత్ మంగళవారం తెలిపారు. జిల్లాలో రూ.50 వేలకు మించి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న 112 మంది వ్యక్తుల నుంచి పైమొత్తాన్ని సీజ్ చేశామన్నారు. అందులో ఇప్పటివరకు సరైన ఆధారాలు సమర్పించిన 98 మందికి 2,47,04,470 రూపాయల నగదు విడుదల చేసినట్లు చెప్పారు. మిగతా 14 కేసుల్లో సీజ్ చేసిన రూ.1,61,11,000లకు సంబంధించి బాధ్యులు సరైన ఆధారాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సమర్పించాలన్నారు. వివరాలకు కన్వీనర్ మోహన్‌రెడ్డి 89785 88552 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

ముగ్గురు కౌన్సిలర్ల రాజీనామా



మాట్లాడుతున్న కౌన్సిలర్లు నాగరాజు, చందర్, దుర్గేశ్

జోగిపేట (అందోల్): బీఆర్‌ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు కొరబోయిన నాగరాజు, చందర్, దుర్గేశ్ పార్టీకి రాజీనామా చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జోగిపేట మున్సిపాలిటీని అభివృద్ధి చేయని ఎమ్మెల్యేతో కలిసి పని చేయలేమన్నారు. నియోజకవర్గంలో అన్నదమ్ముల పెత్తనంతో ప్రజలు విసిగిపోతున్నారని విమర్శించారు. అందోల్ అభివృద్ధి కేవలం దామోదరతోనే సాధ్యమవుతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఒకట్రెండు రోజుల్లో దామోదర రాజనర్సింహ సమక్షంలో తమ మద్దతుదారులతో కాంగ్రెస్‌లో చేరుతామని తెలిపారు.

ఎన్నికలను బహిష్కరిస్తాం



నిరసన తెలుపుతున్న బాబానగర్ కాలనీవాసులు

జహీరాబాద్ టౌన్: స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని కాలనీవాసులు హెచ్చరించారు. మంగళవారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రంజోల్ గ్రామ పరిధిలో ఉన్న బాబానగర్‌ను ఆరు సంవత్సరాల క్రితం జహీరాబాద్ మున్సిపల్‌లో విలీనం చేశారన్నారు. అప్పటి నుంచి కాలనీ గురించి అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కాలనీలో డ్రైనేజీ, రోడ్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని చెప్పారు. తాగునీటి సరఫరా సక్రమంగా లేదని, పారిశుద్ధ్యం కూడా అధ్వానంగా తయారైందని వివరించారు. బాబానగర్ నుంచి పిచరాగడి వరకు గల రోడ్డు వేయాల్సి ఉండగా అందుకు అవసరమైన నిధులు అప్పుడెప్పుడో మంజూరైనా గానీ పనులు ప్రారంభించ లేదన్నారు. ఈ సమస్యలు పరిష్కరించకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు.

పూజారికి బంగారు నంది అవార్డు



కృష్ణమాచార్యకు అవార్డు అందజేస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు

నంగునూరు(సిద్దిపేట): పౌరోహిత్యం, శుభకార్యాలు చేస్తూ గ్రామస్తుల ప్రశంసలు పొందిన గట్లమ్మ్యాల పురోహితులు కర్ణకంటి కృష్ణమాచార్యులుకు వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బంగారు నంది తోపాటు స్వర్ణ కంకణ అవార్డు దక్కింది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వల్లూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పురోహితులు కృష్ణామాచార్యను ఎంపీపీ ఉపాధ్యక్షురాలు రేణుక, నాయకులు వేణుగోపాలచారి స్థానిక నాయకులు సన్మానించారు.

సీపీ పేరుపై ఫేక్ ఐడీ క్రియేట్

అప్రమత్తంగా ఉండాలి: సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత పేరుపై గుర్తుతెలియని వ్యక్తులు ఫేక్ ఐడీ క్రియేట్ చేసి అత్యవసరంగా డబ్బులు అవసరం ఉన్నాయని మెసేజ్‌లు పంపుతున్నారని వాటికి ఎవరూ స్పందించవద్దని సీపీ శ్వేత సూచించారు. సీపీ ఫొటోను డీపీగా పెట్టి పేస్‌బుక్‌లో 99349 41611 నంబర్ పై ఫేక్ ఐడీ ని క్రియేట్ చేశారని ఆమె తెలిపారు. డబ్బులు అవసరం ఉన్నాయని డబ్బులు పంపించాలని కోరుతూ వాట్సాప్, సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారన్నారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి ఎవరికైనా మెసేజ్‌లు వచ్చి డబ్బు అడిగితే ముందుగా నిర్ధారించుకోవాలన్నారు.

కాంగ్రెస్‌లో కాటా కాక



- పటాన్‌చెరు టికెట్ ఆశించి భంగపడిన శ్రీనివాస్‌గౌడ్
- గాంధీభవన్, రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడించిన ఆయన అనుచరులు
- నారాయణఖేడ్‌లో సైతం సంజీవరెడ్డి మద్దతుదారుల నిరసన
- అధిష్టానం పునరాలోచన చేయాలని డిమాండ్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: కాంగ్రెస్‌లో నెలకొన్న అసమ్మతి మరోమారు భగ్గుమంది. ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థులకు సంబంధించి మూడో జాబితాను సోమవారం రాత్రి విడుదల చేసింది. ఇందులో సంగారెడ్డి జిల్లాకు చెందిన పటాన్‌చెరు నియోజకవర్గ టికెట్‌ను ఇటీవల ఆ పార్టీలో చేరిన నీలం మధు ముదిరాజ్‌కు కేటాయించింది. దీంతో టికెట్ ఆశించిన ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ వర్గం తీవ్ర అసమ్మతిని వ్యక్తం చేసింది. సోమవారం అర్ధరాత్రి దాటాక ఆయన అనుచరులు స్థానికంగా నిరసనలకు దిగారు. పార్టీ జెండాలను దహనం చేశారు. మంగళవారం ఉదయం పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు బయలుదేరి వెళ్లారు. హైదరాబాద్‌లోని ఆయన ఇంటి వద్ద నిరసన తెలిపారు. ఇటు గాంధీభవన్‌ను సైతం ముట్టడించారు. రామచంద్రాపురంలోనూ ఆయన అనుచరులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. టికెట్‌పై అధినాయకత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. పటాన్‌చెరు టికెట్‌ను అమ్ముకున్నారని శ్రీనివాస్‌గౌడ్ అనుచరులు ఆరోపించారు.

నారాయణఖేడ్‌లోనూ..

ఖేడ్ కాంగ్రెస్ టికెట్ విషయంలో అసంతృప్త గళాలు వినబడ్డాయి. మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్‌కు దక్కగా ఇదే రేసులో ఉన్న సంజీవరెడ్డి వర్గం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ విషయమై అధిష్టానం పునరాలోచన చేయాలని ఆయన వర్గీయులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తాము పార్టీ పదవులకు రాజీనామా చేస్తామని హెచ్చరించారు.



మంగళవారం ఖేడ్‌లోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో నిరసనకు దిగారు.

తీవ్ర అసంతృప్తిలో దామోదర

రెండు నియోజకవర్గాల టికెట్లు తన అనుచరులకు దక్కకపోవడంతో సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర రాజనర్సింహ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. పటాన్‌చెరు టికెట్‌ను కాటా శ్రీనివాస్‌గౌడ్‌కు ఇప్పించుకునేందుకు ఆయన తీవ్ర ప్రయత్నాలు చేశారు. నారాయణఖేడ్ టికెట్ విషయమై కూడా సంజీవరెడ్డికి వచ్చేలా అధిష్టానం పెద్దలతో మాట్లాడారు. కానీ అనూహ్యంగా అవి అనుచరులకు దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మంగళవారం తన నియోజకవర్గం మునిపల్లి మండలంలో ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేసి, ఢిల్లీకి వెళ్లినట్లు తెలిసింది.

సయోధ్యకు యత్నం: ఖేడ్ టికెట్ షెట్కార్‌కు దక్కగా అసంతృప్త నేత సంజీవరెడ్డిని బుజ్జగించే ప్రయత్నాలు జరిగాయి. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయనను పార్టీ నేతలు బుజ్జగించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో దామోదర రాజనర్సింహ సైతం ఉన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మరొకరికి టికెట్.. బాధాకరం



ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

రామచంద్రాపురం(పటాన్ చెరు): పదేళ్లుగా కాంగ్రెస్‌ను, కార్యకర్తలను కాపాడుకుంటూ వస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్‌ను కాదని మరొకరికి ఇవ్వడం బాధాకరమని ఆయన అనుచరులు అన్నారు. పటాన్‌చెరు అభ్యర్థిగా నీలం మధు పేరును సోమవారం రాత్రి అధిష్టానం ప్రకటించగా అర్ధరాత్రి రామచంద్రాపురం డైమండ్ చౌరస్తా, బీరంగూడ చౌరస్తా వద్ద రేవంత్ రెడ్డి, జగ్గారెడ్డికి వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. అనంతరం ఫ్లెక్సీలను, దిష్టిబొమ్మలను, టైర్లను 62వ జాతీయ రహదారిపై దహనం చేశారు. ఓ స్కూటీ కూడా పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వారిని శాంతింపచేశారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ శ్రీనివాస్ పేరును ప్రకటిస్తామని అధిష్టానం చెప్పుకుంటూ వచ్చి చివరికి మరొకరి పేరు ప్రకటించడం ఏంటని ప్రశ్నించారు. ఆయనకు టికెటిస్తే విజయం సాధిస్తారని తెలిపారు.

శ్రీనివాస్ గౌడ్ చేసిన తప్పేంటి?

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుధా



'కాంగ్రెస్ అధిష్టానం కాటా శ్రీనివాస్ గౌడ్‌కు టికెట్ ఎందుకు ఇవ్వలేదు? తాను చేసిన తప్పేంటో ప్రజలకు చెప్పాల్సిన బాధ్య త అధినేతలకు ఉంది.' అని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా కాంగ్రెస్ జెండా మోస్తూ కార్యకర్తలను కాపాడుకుంటూ వచ్చారన్నారు. భారత్ జోడో యాత్ర సైతం విజయవంతం చేశారని తెలిపారు. అర్హులకు దళిత బంధు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నియోజవర్గస్థాయిలో ఉద్యమించారని గుర్తుచేశారు. టికెట్ కేటాయించే విషయమై ఆయన పేరు చివరి క్షణం వరకు వినిపించిందన్నారు. మరి.. నీలం మధు ముదిరాజ్‌కు టికెట్ ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు.

'పదవులకు రాజీనామా చేస్తాం'

నారాయణఖేడ్: టికెట్ కేటాయింపు విషయాన్ని పునఃపరిశీలించకుంటే కాంగ్రెస్ పార్టీ పదవులతో పాటు సర్పంచ్, ఎంపీటీసీ తదితర పదవులకు సైతం మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని పీసీసీ ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి వర్గీయులు ప్రకటించారు. సురేశ్ షెట్కార్‌కు టికెట్ కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ పట్టణంలో మంగళవారం నిరసన చేపట్టారు. జాతీయ రహదారిపై చెత్తను తగలబెట్టారు. సంజీవరెడ్డి స్వగృహ ఆవరణలో, రాజీవ్ చౌక్‌లో బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడారు. పార్టీ సభ్యత్వ నమోదు, చేసిన అన్ని సర్వేల్లోనూ ఆయన ముందుంజలో ఉన్నారని గుర్తుచేశారు. పైరవీల అనంతరం అభ్యర్థిని ప్రకటించడం సరికాదని అన్నారు. బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు మా ఫంక్షన్‌హాల్‌లో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. నిరసనలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రవి, నియోజకవర్గ ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

షెట్కార్.. బీఫామ్ అందుకున్న కుమార్తె



బీఫామ్ అందుకుంటున్న గిరిజా షెట్కార్

నారాయణఖేడ్: కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సురేశ్ షెట్కార్ బీఫామ్‌ను ఆయన కుమార్తె గిరిజా షెట్కార్ అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే అందజేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్‌చార్జి రోహిత్ చౌదరి, పీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్, నాయకులు అభిషేక్, శివరావు షెట్కార్, మన్సూర్ అలీఖాన్, సూరజ్ తివారీ పాల్గొన్నారు.


జనతా కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుల్ రహీంకు బీఫామ్



జనతా కాంగ్రెస్ బీఫామ్ అందుకున్న అబ్దుల్

నారాయణఖేడ్: జనతా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మోహతాబ్‌రాయ్.. ఖేడ్ టికెట్‌ను అబ్దుల్ రహీంకు ఖరారు చేశారు. ఆయన నాగల్‌గిద్ద మండలం ఏస్గి గ్రామానికి చెందిన వ్యక్తి. కాగా మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బీఫామ్‌ను రాయ్ అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సర్వేందర్, రాష్ట్ర, స్థానిక నాయకులు పండరి, తయ్యబ్, అరుణ, దుల్బానాయక్, మన్సూర్ పాషా పాల్గొన్నారు.

నాల్గో రోజు 13 నామినేషన్లు



పటాన్‌చెరు: కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు తరఫున నామినేషన్ వేస్తున్న ఆయన సతీమణి కవిత



జహీరాబాద్: నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి రాంచందర్ రాజనర్సింహ

సంగారెడ్డి: నాల్గో రోజైన మంగళవారం జిల్లాలో 13 నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి శరత్ తెలిపారు. అందోల్‌లో మూడు, జహీరాబాద్‌లో నాలుగు, పటాన్‌చెరులో ఐదు, సంగారెడ్డిలో ఒక నామినేషన్ దాఖలైందని చెప్పారు. నారాయణఖేడ్ నుంచి ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని వివరించారు. సంగారెడ్డిలో ఆలిండియా మహిళా ఎంపోవార్మెంట్ పార్టీ తరుపున పోలీస్ రాంచంద్రయ్య నామినేషన్ వేశారు. జహీరాబాద్‌లో బీజేపీ అభ్యర్థి రాంచందర్ రాజనర్సింహ, ధర్మసమాజ్ పార్టీ తరపున మ్యాతరి మహేందర్, బహుజన ముక్తి పార్టీ నుంచి బి.చంద్రకాంత్, స్వతంత్ర అభ్యర్థిగా బి.రాములు నామినేషన్ దాఖలు చేశారు. అందోల్‌లో భారత చైతన్య యువజన పార్టీ నుంచి దేవదాస్, బహుజన్ ముక్తి నుంచి ఆదిలాబాద్ ఇచ్చోడ వాసి గుమ్మడి లక్ష్మణ్ నామినేషన్లు వేశారు. పటాన్‌చెరులో.. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు తరఫున ఆయన సతీమణి కవిత, బీజేపీ అభ్యర్థి నందీశ్వర్ గౌడ్ తరఫున ఆయన కుమారుడు ఆశిష్ గౌడ్, ధర్మ సమాజ్ పార్టీ నుంచి లక్ష్మణ్, స్వతంత్ర అభ్యర్థులుగా రాములు, ఖదీర్ మొహీద్దీన్ నామినేషన్ దాఖలు చేశారు.

జహీరాబాద్‌లో ఏఐసీసీ బృందం

జహీరాబాద్: ఏఐసీసీ బృందం సభ్యులు మంగళవారం పట్టణానికి విచ్చేసి ఎన్నికలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఏఐసీసీ ప్రత్యేక అధికార ప్రతినిధి రోషన్ గుప్తా, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల అబ్జర్వర్ వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్‌ను కలిశారు. అనంతరం ప్రత్యేకంగా సమావేశమై కాంగ్రెస్ సంస్థాగత విషయాలపై చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని గెలిచేందుకు ఉన్న అవకాశాలు తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం.



చంద్రశేఖర్‌ను కలిసిన ఏఐసీసీ సభ్యులు

టికెట్లు అమ్ముకున్నోళ్లు .. రాష్ట్రాన్ని అమ్ముకోరా?

కాంగ్రెస్‌పై మంత్రి హరీశ్‌రావు ధ్వజం



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

జోగిపేట (అందోల్): కాంగ్రెస్ పార్టీ టికెట్లను అమ్ముకుంటోందని, అవకాశమిస్తే రాష్ట్రాన్ని అమ్ముకుంటారని ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. సంగారెడ్డి జిల్లా అందోల్‌లో నియోజకవర్గ స్థాయి బూత్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పటాన్‌చెరు కాంగ్రెస్ టికెట్ రూ.100 కోట్లకు అమ్ముకున్నారని ఆరోపించారు. అందువల్లే గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. 30 ఏళ్లుగా కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే ఏం చేశారని, వారిని గెలిపిస్తే ప్రభుత్వ పథకాలన్నీ ఆగిపోయి ప్రజలంతా ఆగమైపోతారన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహి అని, అధికారంలో వచ్చేందుకు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అందోల్ కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహ పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాల పట్ల రగిలిపోతున్నారని చెప్పారు. పెద్దరికంతో వాళ్లకు వీళ్లకు సీటు ఇప్పిస్తా అని మాట ఇచ్చి భంగపడి ఆగం అవుతున్నారని చెప్పారు. కేసీఆర్ పాలనలో రైతు విలువ, భూమి విలువ పెరిగిందన్నారు. రైతు బీమా తరహాలోనే రూ.5 లక్షల బీమాను కోటి కుటుంబాలకు చేయనున్నట్లు తెలిపారు. ఆసరా పింఛన్లు రూ.5 వేలు అందించనున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీ బీబీ పాటిల్, అందోల్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ తదితరులు జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, బీఆరెస్ రాష్ట్ర నాయకులు రాహుల్ కిరణ్, జైపాల్ రెడ్డి, కాశీనాథ్, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచాలి: కలెక్టర్

నారాయణఖేడ్: కర్ణాటక సరిహద్దుగా ఉన్న నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ శరత్ తెలిపారు. ఖేడ్ ఈఆర్వో కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఎన్నికల విభాగాలతోపాటు హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించారు. ఈఆర్వో వెంకటేష్, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఎన్నికల అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. పొరుగు రాష్ట్రాలు, జిల్లాల సరిహద్దుల్లో 17 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పటిష్టమైన నిఘాను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 13.77 లక్షల మంది ఓటర్లు ఉండగా 1,609 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇందులో 401 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు పేర్కొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

జోగిపేట (అందోల్): నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి శరత్ పేర్కొన్నారు. మంగళవారం అందోల్‌లో ఉన్న నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఆపై అధికారులకు పలు సూచనలు చేశారు. అభ్యర్థులు సమర్పించే నామినేషన్ పత్రాల్లో తప్పులు లేకుండా క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ ప్రక్రియకు సంబంధించిన బందోబస్తు ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని నోడల్ అధికారికి, డీఎస్పీ బాలాజీకి సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాండు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంలను సిద్ధం చేసుకోండి

జిల్లా ఎన్నికల అధికారికి సీఈఓ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల అధికారి శరత్

సంగారెడ్డి టౌన్: ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు అన్నివిధాలుగా సన్నద్ధం కావాలని, అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల (సీఈఓ) అధికారి వికాస్ రాజ్ జిల్లా ఎన్నికల అధికారికి సూచించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులపై కలెక్టర్, ఎస్పీతో కలిసి సీఈఓ సమీక్షించారు. నామినేషన్లు ఈనెల 10తో ముగుస్తోందని, పోలింగ్ నిర్వహణ కోసం ఈవీఎంలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఇప్పటికే మొదటి ర్యాండమైజేషన్ ద్వారా ఈవీఎంలను నియోజకవర్గ కేంద్రాలకు తరలింపు ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. సెకండ్ ర్యాండమైజేషన్ ఈనెల 18న నిర్వహించాలని సూచించారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన మీదట అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బ్యాలెట్ పత్రాల ముద్రణలోనూ ఎలాంటి తప్పులు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని వివరించారు.

కోతలు.. వెతలు



వరి కోతలు కోసి కుప్పలుగా రైతులు వేశారు. తుపాను ప్రభావంతో కంగ్టి మండలంలో మోస్తరు వర్షం కురిసింది. వాటిపై వారు టార్పాలిన్‌లతో కప్పే యత్నం చేసినా తడిచాయి. వారం రోజులుగా మండలంలోని తడ్కల్, ఘన్‌పూర్, బాన్సువాడ, ముర్కుంజాల్, జమ్గి, గాంధీనగర్, చాప్టా, దామర్‌గిద్దా, రాసోల్, వల్మూర్, ఎంపల్లి తదితర గ్రామాల శివారుల్లోని రైతులు వరి కోతలు ప్రారంభించారు. - కంగ్టి(నారాయణఖేడ్)



రోడ్లపై రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కల్లాలు లేకపోవడమే ఇందుకు కారణమని వారు చెబుతున్నారు. అయితే రాత్రిపూట ప్రయాణిస్తే వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం లేకపోలేదు. హత్నూర మండలంలోని ప్రధాన రహదారైన హత్నూర-జోగిపేట రహదారిపై గోవిందరాజుపల్లి, సిరిపురంతోపాటు వడ్డేపల్లి, ఇతర ప్రధాన రహదారులపై ఇలాంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. - హత్నూర (సంగారెడ్డి)

'బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ'

గజ్వేల్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు పట్టణంలోని కోటమైసమ్మ ఆలయం నుంచి ఇందిరాపార్కు చౌరస్తా మీదుగా ఐఓసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి ప్రసంగిస్తూ ఇప్పటివరకు తాము బీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకోలేదని, భవిష్యత్తులోనూ ఉండబోదన్నారు. కాంగ్రెస్ అనేక సందర్భాల్లో పొత్తు పెట్టుకొని కేంద్రంలో, రాష్ట్రంలో ఆ పార్టీ నేతలకు మంత్రి పదవులను ఇచ్చిందన్నారు. పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ మాట్లాడుతూ నామినేషన్‌కు తరలివచ్చిన జనాన్ని చూస్తుంటే బీఆర్‌ఎస్ నేతలు వందల కోట్లు పంచినా, దావతులు ఇచ్చినా తానే గెలుస్తున్నాననే విషయం స్పష్టమవుతోందన్నారు.

క్లుప్తంగా

దుబ్బాక అభివృద్ధి కాంగ్రెస్‌కే సాధ్యం

తొగుట(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి కాంగ్రెస్ పార్టీకే సాధ్యమవుతుందని ఆ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మండల కేంద్రమైన తొగుట సర్పంచ్ పాగాల కొండల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పబ్బతి మల్లారెడ్డి, దశమంతరెడ్డి, దయాకర్‌రెడ్డి, మల్లేశం, గోవర్ధనగిరి గ్రామ పంచాయతీ సభ్యుడు లింగం, ఎల్లారెడ్డిపేటకు చెందిన పలువురు యువకులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో స్వామి, తిరుపతి, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ వైపే ప్రజల చూపు

జిన్నారం(పటాన్‌చెరు): అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నారని ఆ పార్టీ అభ్యర్థి నందీశ్వర్ గౌడ్ అన్నారు. మంగళవారం గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరభద్రేశ్వర స్వామి ఆలయం నుంచి వీరన్న గూడెం, బొంతపల్లి, దోమడుగు, అన్నారంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గిద్దె రాజు, చింతల యాదగిరి, రాజిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అంజిరెడ్డి, రవీందర్ రెడ్డి, రాఘవరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఉదయ్, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే సమగ్రాభివృద్ధి

కల్హేర్(నారాయణఖేడ్): సీఎం కేసీఆర్‌తోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని నారాయణఖేడ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సిర్గాపూర్ మండలం ఉజలంపాడు, లక్ష్మణ్‌నాయక్, డాకు, రూప్ల, గైర్హాన్, వంగ్దల్, బీబ్యానాయక్ తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాంపేట మండలం దామర్‌చెరువుకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు అశోక్, మన్నె నర్సింలు, సంగమేష్ తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రాఘవరెడ్డి, సంజీవరావు, అరుణ్‌రాజ్ షెరికార్ పాల్గొన్నారు.

మా మద్దతు హరీశ్‌కే..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అసెంబ్లీ ఎన్నికల్లో హరీశ్‌రావుకే మద్దతు ఇస్తున్నట్లు నాయీబ్రాహ్మణుల సంఘం తీర్మానించింది. మంగళవారం స్థానిక శివానుభవ మండపంలో ఆ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తీర్మాన పత్రాన్ని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సుకు అందించారు.

రోలులో రోకలితో రుబ్బి..



ఓట్ల కోసం నాయకులు, కార్యకర్తలు అనేక ఫీట్లు చేస్తున్నారు. మండలంలోని బహిరన్‌దిబ్బ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. ఓ ఇంట్లోకి వెళ్లి పనులు చేస్తూ.. అక్కా నీ ఓటు కారు గుర్తుకే వేయాలని అభ్యర్థించారు. మాజీ సర్పంచ్ రమేశ్ రోలులో రోకలితో రుబ్బుతూ ఓటర్లను ఆకట్టుకున్నారు. – అల్లాదుర్గం(మెదక్)

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-1220944]

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్టును అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్ DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు ఖర్చులు. 9990752820. [T-203]

BUSINESS OFFER

■ Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact : for more info: 8099161810. [H-193272]

WANTED

■ మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-601043]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K. Ph: 9848571888/ 9640400073 [H-189349]

■ రామకృష్ణ గ్రూపు, (TS No.1) HYD, VJA, శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు MF వర్కర్స్ కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. TS & AP అంతటా వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. ✆ 92814 52838, 82474 49036. [B-1206468]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అక్కా.. కారును మరువొద్దు



పంట చేనులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

మండల పరిధిలో బీఆర్‌ఎస్ నాయకులు వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. ఎక్కడ జనం కనిపిస్తే అక్కడ వాలిపోతున్నారు. మంగళవారం గుంటిపల్లి మిరప చేనులో పనిచేస్తున్న మహిళల వద్దకు వెళ్లి కారుకు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.

వర్గల్(గజ్వేల్)

ఇస్త్రీ చేసే బాధ్యత నాది..



ఇస్త్రీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

మున్సిపల్ పరిధిలోని బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం జోరందుకుంది. ఆ పార్టీ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం లచ్చపేటలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ లాండ్రీ దుకాణంలో ఆమె బట్టలు ఇస్త్రీ చేస్తూ కారు గుర్తుకే ఓటేయాలని కోరారు.

దుబ్బాక

దుర్గమ్మా .. గెలిపించమ్మా..!



దుర్గమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి మంగళవారం ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకున్నారు. మెదక్‌లో నామినేషన్ వేయడానికి వెళ్లే ముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నామినేషన్ పత్రాలు అమ్మవారి పాదాల చెంత ఉంచి.. ఎన్నికల్లో గెలిపించాలమ్మా అని వేడుకున్నారు.

పాపన్నపేట(మెదక్)

హద్దు దాటితే.. కటకటాలే!



అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకుంటుంది. ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు, ఉద్యోగులు, సిబ్బంది ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధమైంది. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా కేసులు నమోదు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది.



- ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే శిక్ష ఖాయం!
- ప్రజా ప్రాతినిథ్యం చట్టం కింద కఠిన చర్యలు
- ఎన్నికల వేళ భారతీయ శిక్షాస్మృతి

జహీరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు ఒక వైపు గడువు సమీపిస్తోంది.. మరో వైపు అభ్యర్థులు ప్రచారంలో బిజీబిజీగా గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో అభ్యర్థులు విశ్వ ప్రయత్నాలు చేస్తుంటారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అనేక రకాల కానుకలు, తాయిలాలు అందిస్తుంటారు. ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా ఎన్నికల చట్టం ప్రకారం నేరమే అవుతుంది. అలాచేసిన వారిపై భారతీయ శిక్షాస్మృతి, ప్రజా ప్రాతినిధ్య చట్టం(రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్) –1951, ఎక్సైజ్ చట్టం –1968 ప్రకారం పలు రకాల కేసులు నమోదు చేస్తారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తప్పవు. జరిమానాతో పాటు జైలుశిక్ష పడే అవకాశం ఉంది. ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే, ధన ప్రభావం తగ్గాలంటే, ఉత్తమ అభ్యర్థులు గెలవాలంటే అక్రమాలపై పౌరులు ఆధారాలతో ఫిర్యాదు చేయాలి. ఎన్నికల నేపథ్యంలో ఏయే నేరాలకు ఎలాంటి శిక్షలు, జరిమానాలు విధిస్తారో తెలుసుకుందాం.

మద్యం పంపిణీ చేస్తే..

ఎన్నికల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి నేతలు మద్యం పంపిణీ చేస్తుంటారు. పోలీసులు, అధికారుల తనిఖీల్లో అనుమతి లేకుండా, పరిమితికి మించి మద్యం నిల్వ పెట్టుకున్నా, విక్రయించినా, ఓటర్లకు పంపిణీ చేసినా కేసులు నమోదు చేస్తారు. ఓటర్లకు కల్లు, సారాయి, మద్యం, ఇతర మత్తు పదార్థాలు ఏవి ఇచ్చినా నేరమే. ఎక్సైజ్ చట్టం–1968 సెక్షన్ 34(ఎ) ప్రకారం ఆరు నెలల నుంచి ఏడాది వరకు జైలు శిక్ష పడుతుంది. రూ.5వేల నుంచి రూ.20వేల వరకు జరిమానా విధిస్తారు.

డబ్బు పంచితే..

ఎన్నికల్లో గెలవడానికి అభ్యర్థులు ఓట్లను డబ్బుతో కొనేందుకు ప్రయత్నం చేస్తారు. ఓటర్లకు డబ్బులను పంపిణీ చేసేటప్పుడు పట్టుబడితే ఐపీసీ 171(ఇ) ప్రకారం ఏడాది జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం కూడా శిక్షలు అమలు చేస్తారు.

కానుకలు ఇవ్వడం..

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటర్లను ఆకర్షించేందుకు కానుకలు అందించినా నేరమే. మహిళలకు చీరలు, గృహోపకరణాలు, యువకులకు క్రీడా సామగ్రి, సెల్‌ఫోన్లు అందజేయడం ఇలా ఏవి ఇచ్చినా 171(ఈ) ప్రకారం ఏడాది జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తారు.

బెదిరింపులకు పాల్పడితే...

ఎన్నికల్లో తమకే ఓటు వేయాలని అభ్యర్థులు, వివిధ పార్టీల నాయకులు ఓటర్లను బెదిరించకూడదు. అలా చేస్తే ఐపీసీ 171(సీ) ప్రకారం కేసు నమోదు చేస్తారు. ఏడాది జైలు శిక్షతో పాటు జరిమానాలు విధించవచ్చు. రెండూ కూడ విధించే అవకాశాలుంటాయి.

అబద్ధాలతో ప్రచారం

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు అబద్ధాలు చెబుతూ ప్రచారం చేస్తే నేరమే అవుతుంది. లేనివాటిని ఉన్నట్లుగా చెప్పడం, పోటీచేసే రాజకీయ ప్రత్యర్థిపై తీవ్రమైన నిందలు వేస్తూ ఆరోపణలు చేయడం నేరంగా పరిగణిస్తారు. అందుకు ఐపీసీ 171(జీ) ప్రకారం జరిమానా విధిస్తారు.

దొంగ ఓటు వేస్తే...

ఎన్నికల్లో ఒకరి ఓటు మరొకరు వేస్తుంటారు. ఇలాంటి వాటినే దొంగ ఓట్లు అంటారు. తర్వాత వచ్చిన అసలు ఓటరు తన ఓటు ఎవరో వేశారని తెలిసి అవాక్కవుతారు. ఇలా దొంగ ఓట్లు వేయించినా, వేసినా చట్ట ప్రకారం నేరమే. ఐపీసీ 171(ఎఫ్) ప్రకారం ఏడాది జైలుతో పాటు జరిమానా విధిస్తారు.

విద్వేష పూరిత ప్రసంగాలు చేస్తే..

ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంచేలా విద్వేషపూరిత ప్రసంగాలు, వ్యాఖ్యలు చేసే వారిపై ప్రజా ప్రాతినిధ్య చట్టం(ఆర్‌పీ యాక్ట్)–125 నిబంధనల ప్రకారం మూడేళ్ల జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది. రెండు కూడా విధించవచ్చు. ఎవరూ మతాలు, వర్గాలను కించపరిచేలా, మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడవద్దు.

బైండోవర్ అంటే ..?

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎన్నికల సందర్భంగా పోలీసులు పలువురిని బైండోవర్ చేస్తున్నారు. అసలు బైండోవర్ అంటే ఏమిటి?.. అనేది చాలా మందికి తెలియదు. ఇప్పుడు దాని గురించి తెలుసుకుందాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిని గుర్తించి స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరుపరుస్తారు. మళ్లీ ఎలాంటి నేర ఘటనల్లో తలదూర్చకుండా ఒకరి పూచీకత్తు లేదా సొంత పూచీకత్తుపై బాండ్ పేపర్ ద్వారా ఒప్పందం చేసుకుంటారు. ఈ ప్రక్రియనే బైండోవర్ అంటారు. వివిధ రకాల నేరాల్లో నిందితులుగా ఉన్న వారిని, రౌడీషీటర్, దొంగతనాలకు పాల్పడిన వారిని ప్రస్తుత ఎన్నికల వేళ ఎలాంటి నేర ఘటనల్లో తలదూర్చకుండా, సత్ప్రవర్తన కలిగి ఉంటానని బాండ్ పేపర్‌పై రాయించి సంతకం తీసుకుంటారు. గతంలో వారు చేసిన నేరాల తీవ్రతను బట్టి సీఆర్‌పీసీ సెక్షన్ 107 నుంచి 111వరకు నోటీసులు జారీ చేసి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు సొంత పూచీకత్తుతో బైండోవర్ చేస్తూ సంతకం తీసుకుంటారు. బైండోవర్ అయిన వారు ఏదైనా ఘటనలో తలదూర్చితే పైన తెలిపినట్లు జరిమానాను చెల్లించాల్సి ఉంటుంది. లేదంటే ఆరు నెలల నుంచి ఏడాది జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. బైండోవర్‌లు ఎన్నికల సమయంలో ఎక్కువగా చేస్తుంటారు.

రాష్ట్రాన్ని లూటీ చేసిన కేసీఆర్ కుటుంబం

వర్గల్(గజ్వేల్): తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలను విస్మరించిన సీఎం కేసీఆర్ కుటుంబం.. రాష్ట్రాన్ని లూటీ చేసిందని కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి వర్గల్ మండలం గౌరారంలో ఆయన ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. స్థానికుడినైన తనను మీలో ఒకడిగా ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. మేనిఫెస్టోలోని ఆరుగ్యారంటీ పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి, సందీప్‌రెడ్డి, తోట ముత్యాలు, మోహన్, నర్సింలు, హన్మంతరెడ్డి, నర్సింలుగౌడ్ పాల్గొన్నారు.

ఒకే రోజు.. ఒకే పార్టీ నుంచి..

- కాంగ్రెస్ నుంచి నేడు ఇద్దరు నామినేషన్లు
- బీ ఫాం అందుకున్న రాజిరెడ్డి
- ప్రయత్నం ఆపని గాలి అనిల్‌కుమార్



ఆవుల రాజిరెడ్డి



గాలి అనిల్‌కుమార్

నర్సాపూర్: సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైనా నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి గోల ఓ కొలిక్కి రాలేదు. పార్టీ బీ ఫామ్ కోసం ఆవుల రాజిరెడ్డి, గాలి అనిల్‌కుమార్, ఆంజనేయులుగౌడ్, రవీందర్‌రెడ్డి ప్రయత్నించారు. చివరికి ఆ పార్టీ అధిష్టానం ఆవుల రాజిరెడ్డికి బీ ఫామ్ అందజేసింది. దీంతో ఆయన మంగళవారం తన తల్లి ప్రేమలతతో ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయించారు. మరో సెట్‌ను బుధవారం దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ చేపట్టేందుకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది.

ఇదిలా ఉండగా పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ సైతం బుధవారం కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తానని సోమవారం ప్రకటించారు. నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక విషయంలో పార్టీ అధిష్టానం పునరాలోచించాలని, ఆవుల రాజిరెడ్డిని మార్చి తనకు టికెట్ ఇవ్వాలని ఆయనతోపాటు తన వర్గీయులు అధిష్టానానికి విజ్ఞప్తులు చేసిన విషయం తెలిసిందే. అభ్యర్థిని మార్చి పార్టీ తనకు బీఫాం అందజేస్తుందన్న నమ్మకంతో నామినేషన్ వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఒకే పార్టీ నుంచి ఇద్దరు నాయకులు బీఫాం వేస్తుండటంతో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. నాయకులు, కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. త్వరగా అధిష్టానం ఓ నిర్ణయం తీసుకుని పార్టీలో నెలకొన్న సందిగ్ధతను తొలగించాలని కోరుతున్నారు.

టచ్‌లో ఇతర పార్టీల నేతలు?

కాంగ్రెస్‌లో అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఆ పార్టీలోని కొందరు నాయకులతో ఇతర పార్టీల నాయకులు టచ్‌లో ఉన్నారని ప్రచారం జరుగుతుంది. ప్రస్తుతం ఆవుల రాజిరెడ్డికి బీ ఫామ్ దక్కిన విషయం తెలిసిందే. కాగా టికెట్ కోసం ఇంకా ప్రయత్నం చేస్తున్న గాలి అనిల్‌కుమార్ వర్గం నాయకులతో పాటు టికెట్ పొందిన ఆవుల రాజిరెడ్డి వర్గం నాయకులతోనూ బీఆర్‌ఎస్, బీజేపీలు టచ్‌లో ఉంటున్నాయని తెలిసింది. అసమ్మతి నేతలను తమ పార్టీలోకి చేర్చుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆయా పార్టీల ప్రయత్నాలు ఏ మేరకు సఫలం అవుతాయో చూడాలి.

శ్వాస, ధ్యాస దుబ్బాకే

- నా బలం.. బలగం మీరే
- ప్రాణం ఉన్నంత వరకు ప్రజా సేవలోనే
- పుట్టింది ఇక్కడే.. చచ్చేది ఇక్కడే..
- అభివృద్ధికే అధిక ప్రాధాన్యం
- రోడ్‌షోలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు
- భారీగా హాజరైన జనం



రోడ్ షోకు హాజరైన జనం



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే

దుబ్బాకటౌన్: దుబ్బాకలో మీ కోసం ప్రాణం ఇచ్చే గరీబోళ్ల బిడ్డ కావాలో.. గూండాగిరి రాజ్యం కావాలో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం దుబ్బాకలో నామినేషన్ వేసిన అనంతరం పార్టీ జాతీయ అధికారప్రతినిధి, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డిలతో కలిసి పట్టణంలో భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే వ్యక్తి కావాలో.. పట్నంలో ఉండి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసే వ్యక్తి కావాలో తేల్చుకోవాలన్నారు. నిరుద్యోగుల కోసం దుబ్బాకలో టెట్, డీఎస్సీ, ఎస్‌ఐ, కానిస్టేబుల్ కోచింగ్ కోసం నా సొంత డబ్బులు వెచ్చించి ఇప్పించానన్నారు.13 వేల మందికి డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేశానన్నారు. రఘునందన్ గెలిచాకే దుబ్బాకలో కొత్త బస్టాండ్, వంద పడకల ఆస్పత్రి, ఐటీసీ భవనం, భూంపల్లి కొత్త మండలం అయిందన్నారు. నా బలం..బలగం మీరేనని నన్ను మళ్లీ ఆశీర్వదించి గెలిపిస్తే నా తుదిశ్వాస వరకు మీకు సేవచేస్తానన్నారు. దుబ్బాక రూపురేఖలు మారుస్తానన్నారు.

ఇక్కడే పుట్టాను..

నేను పుట్టింది దుబ్బాకలోనే.. చస్తే ఇక్కడనే.. కరీంనగర్, కామారెడ్డిల నుంచి వలసవచ్చి రాజకీయాలు చేయడంలేదన్నారు. అసెంబ్లీలో దుబ్బాక అభివృద్ధి కోసం ప్రభుత్వాన్ని నిలదీశానని.. గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేటలకే నిధులు తప్పా మా దుబ్బాకకు ఎందుకియ్యరంటూ అసెంబ్లీలో నిలదీశానన్నారు.

కేసీఆర్ పోలీసోళ్లు.. పైసలనే నమ్ముకుండు

కేసీఆర్ ఏలాగైన మళ్లీ అధికారంలోకి రావాలని పోలీసోళ్లు,డబ్బులను నమ్ముకొండని ప్రజలు ఈ నిరంకుశ నియంత పాలనకు చరమగీతం పాడి బీజేపీ ని అధికారంలోకి తేవాలన్నారు.బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ బిడ్డను సీఎం ను చేస్తామన్నారు.కాంగ్రెస్ ను గెలిపిస్తే ఏం లాభం ఉండదని మళ్లీ గెలిచిన తర్వాత వారు బీఆర్‌ఎస్ లోనే చేరుతారన్నారు.

జనసంద్రమైన దుబ్బాక

దుబ్బాకలో నిర్వహించిన రోడ్ షో కు నియోజక వర్గం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో జనం తరలివచ్చారు. పట్టణమంతా జనసంద్రంగా మారింది. రోడ్లన్నీ కాషాయమయంగా కనిపించాయి. చత్రపతి శివాజీ చౌరస్తా నుంచి ప్రారంభమైన రోడ్ షో పట్టణంలోని బస్టాండ్, గాంధీ, అంబేడ్కర్, శాస్త్రీ చౌరస్తాల మీదుగా రోడ్ షో కొనసాగింది.

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

సంగారెడ్డి టౌన్: ఎన్నికల విధుల్లో పీఓ, ఏపీఓ, ఓపీఓలుగా నియమించబడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల నోడల్ అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుకు బుధవారం చివరి తేదిగా పేర్కొన్నారు. ఇంటిమేషన్ ఆర్డర్‌తో పాటు ఫారం–12లో వివరాలు పూర్తి చేసి, ఎపిక్ కార్డు జిరాక్స్, ఓటరు కార్డు సీరియల్ నంబరు, పాన్‌కార్డు నంబరు వివరాలతో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందించాలన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

అక్కన్నపేట(హుస్నాబాద్): బీఎస్‌పీ అక్కన్నపేట మండలాధ్యక్షుడు పొడిశెట్టి అరవింద్‌తో పాటు పలువురు మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆ పార్టీ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్ వారికి గులాబీ కండువాలు కప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, పెసరు సాంబరాజు, మాలోతు బీలునాయక్ ఉన్నారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు

జంగ్ తెలంగాణ

వర్గల్(గజ్వేల్): గత ప్రభుత్వాల హయాంలో స్కాములు, స్కీములు, దోచుకోవడం దాచుకోవడమే తప్ప రాష్ట్రానికి, దేశానికి ఒరగబెట్టిందేమీ లేదని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమానికి నిర్వచనంగా నిలిచిందన్నారు. మంగళవారం వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో యాదవ సంఘం కేసీఆర్‌కు మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిపక్షాల అబద్ధపు మాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కనకరాజు, యాదవ సంఘ ప్రతినిధులు ఉన్నారు.

లక్ష ఓట్ల మెజారిటీ సాధించాలి

గజ్వేల్: సీఎం కేసీఆర్‌కు మద్దతుగా గజ్వేల్‌లోని ప్రజ్ఞా గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన ఎరుకల ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విల్లు ఎక్కు పెట్టడం అందరినీ ఆకట్టుకుంది. అంతేకాకుండా మహిళలతో కలిసి నృత్యం చేశారు. కేసీఆర్‌కు లక్ష ఓట్ల మెజారిటీ వచ్చేలా బీఆర్‌ఎస్ శ్రేణులు శ్రమించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యంగా..

పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ సాహసోపేత నిర్ణయాలతో ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం బూర్గుపల్లి, దాచారం, అనంతరావుపల్లి, పిడిచెడ్ గ్రామాల్లో రోడ్ షోలు నిర్వహించారు. అనంతరం బూర్గుపల్లి సర్పంచ్ వంటేరు విజయ్‌వర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని కుల సంఘాలన్నీ కేసీఆర్ మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మానాన్ని వారికి అందజేశాయి.

నిత్య పర్యవేక్షణకు.. నిఘా నేత్రం

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక నిఘా వ్యవస్థలను వాడుతున్నారు. ప్రతీరోజు ఎలక్షన్ అధికారుల వాహనాలకు పై భాగంలో సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. ర్యాలీలు, సమావేశాలు, నామినేషన్లను దీని ద్వారా పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం గజ్వేల్‌లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ నామినేషన్ వేయడానికి వచ్చిన సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఈ వాహనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

– కె.సతీష్, సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



ప్రత్యేక వాహనంపై ఉన్న సీసీ కెమెరా